ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY



మంచిర్యాల
జిల్లా వార్తలు

5

మంగళవారం 2 జూలై 2024



రెవెన్యూ మ్యాప్‌లో పూర్వపు రాళ్లవాగు దిశ



వాగు స్థలంలో వేసిన ఫెన్సింగ్ (ఫైల్)

రాళ్లవాగు కబ్జా

- మట్టితో పూడ్చివేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు
- ఐదెకరాల వాగు భూముల్లో ప్లాట్ల వెంచర్ ఏర్పాటు
- ఇరిగేషన్‌శాఖ పట్టాలు జారీ చేసిందంటూ ప్రచారం
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

మంచిర్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ప్రభుత్వ స్థలాల కబ్జా యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వ, అసైన్డ్, ఆబాది, చెరువు శిఖం భూములు కబ్జాలకు గురవుతుండగా కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాగులను సైతం ఆక్రమించుకుంటున్నారు. తాజాగా పట్టణ నడిబొడ్డులో ప్రవహిస్తున్న రాళ్లవాగును కబ్జా చేసేశారు. మంచిర్యాల శివారులోని 140, 297 సర్వే నంబర్ల మధ్య ప్రవహిస్తున్న రాళ్లవాగు భూములు సుమారు 5 ఎకరాలను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకోవడంతోపాటు వాగులో మట్టి పోసి చదును చేశారు. తిర్యాని అడవుల నుంచి మంచిర్యాల మీదుగా ప్రవహించి గోదావరి నదిలో కలిసే రాళ్లవాగు వందల సంవత్సరాల క్రితం ఏర్పడింది. 2000లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహించడంతో మంచిర్యాల-పాత మంచిర్యాల మధ్యలో ఉన్న వంతెన కొట్టుకుపోయింది. ప్రజల సౌకర్యార్థం తాత్కాలిక వంతెన నిర్మించారు. రాళ్లవాగును ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేసి, చిన్న కాలువగా మార్చేశారు.

కబ్జా జరిగింది ఇలా

రెవెన్యూ మ్యాప్ ప్రకారం రాళ్లవాగు తిర్యాణి అడవుల నుంచి మందమర్రి మండలం తిమ్మాపూర్ మీదుగా మంచిర్యాల శివారు ప్రాంతాలైన సర్వే నెంబర్‌లు 140, 141, 142, 146, 147, 294, 295, 297లలోని భూముల మధ్య నుంచి ఆంగ్ల అక్షరం "ఎస్" ఆకారంలో ప్రవహిస్తుండేది. వాగు ఉధృతి పెరగడంతో మంచిర్యాల శివారులోని సర్వే నెంబర్‌లు 139, 141, 142లలోని భూములను తాకుతూ పాతమంచిర్యాల మీదుగా ప్రవహించి గోదావరిలో కలుస్తోంది. వాగు ప్రవహించే దిశమారడంతో మందమర్రి మండలం తిమ్మాపూర్, మంచిర్యాల శివారుల మధ్యగల సర్వే నెంబర్‌లు 140, 297ల మధ్య ఉన్న వాగు భూమి సుమారు 5 ఎకరాలను ఇటీవల కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేసి ఆ స్థలంలో మట్టిపోసి చదును చేశారు. స్థానికంగా ఉన్న పట్టా భూముల్లో గతంలో ఇండ్ల నిర్మాణం జరుగగా వాగును ఆనుకొని పైపులతో రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఆ రోడ్డుకు ఉత్తరం వైపు ఉన్న వాగు స్థలాన్ని ఆక్రమించుకొని హద్దు కోసం స్తంభాలు పాతి కంచె ఏర్పాటు చేయగా, దక్షిణంవైపు వాగు భూముల్లో ప్లాట్ల వెంచర్ ఏర్పాటు కోసం మట్టిపోసి చదును చేశారు.

వాగు స్థలం కబ్జా వెనుక ఓ రిటైర్డ్ మండల సర్వేయర్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వాగు స్థలాన్ని అక్రమంగా వ్యాపారులకు పట్టా చేయించడంలో సదరు వ్యక్తే ప్రముఖ పాత్ర పోషించినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా కేంద్రంలో గుట్టు చప్పుడు కాకుండా రాళ్లవాగు భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

భూములకు పట్టాల పేరుతో...

రాళ్లవాగు దిశ మార్చుకొని పట్టా భూముల్లో నుంచి ప్రవహించడం మూలంగా జరిగే నష్టంపై బాధితులు ఇరిగేషన్ శాఖను ఆశ్రయించారని, దీంతో బాధితుల భూములకు బదులు, వాగు పాత దిశలోని భూములకు పట్టాలు జారీ అయ్యాయని ఇటీవల కొందరు తెరపైకి వచ్చారు. ఆ భూముల్లోనే వెంచర్లు ఏర్పాటు చేశామని ప్రచారం చేస్తున్నారు. అయితే వాగులు సహజ సిద్ధంగా ప్రవహిస్తాయని, వాటిలో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం లేదా సమాన విలువ గల భూములు అందజేయడం జరుగదని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. ఆయా ప్రదేశాల్లో బఫర్‌జోన్లు ఉండటం వల్ల ఆ పరిధిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టరాదు.

అయినప్పటికీ పట్టాలున్నాయనే వంకతో సదరు భూముల్లో ప్లాట్ల వెంచర్లు ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ విషయమై ఇరిగేషన్ అధికారుల వివరణ కోరగా రాళ్ల వాగు పూర్వపు దిశలోని భూములకు పట్టాలు జారీ చేసే అంశం తమ పరిధిలోనిది కాదని, అయితే సర్వే జరిపి సంబంధిత రిపోర్టును ప్రభుత్వానికి అందజేస్తామని స్పష్టం చేశారు. ఏదేమైనా పూర్వపు వాగు స్థలంలో జారీ అయిన పట్టాలు అసలువా... కాదా అనే అంశాన్ని తేల్చాల్సిన బాధ్యత ఇరిగేషన్ శాఖ అధికారులపై ఉందని, ఈ విషయంలో సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.



వాగులో పైపులపై పోసిన మట్టి

విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ఎస్ఈకి వినతి



ఎస్ఈకి వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్, కాలనీవాసులు

మంచిర్యాల అర్బన్, జూలై 1: సాయికుంట ఏరియాలో విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యను పరిష్కరించాలని సోమవారం కౌన్సిలర్లు సుదమల్ల హరికృష్ణ, పూదరి సునితప్రభాకర్, వార్డు ప్రజలు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అశోక్‌రోడ్ ఫీడర్ కింద 6 వార్డులకు విద్యుత్ సరఫరా జరుగుతుందని, దీని వల్ల లోవోల్టేజీ సమస్య తలెత్తి తరుచూ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. మూడు నెలల నుంచి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు. ఫీడర్‌ను రెండు విభాగాలుగా గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి, జూలై 1: విద్యుత్ మరమ్మతు కారణంగా నీల్వాయి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ దీక్షిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోటపల్లి: కిష్టంపేట నుంచి కోటపల్లికి వెళ్లే 33కేవీ లైన్ మరమ్మతు కారణంగా మంగళవారం కోటపల్లి, ఆల్గామ, దేవులవాడ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

ఏసీసీ, జూలై 1: బదిలీ అయిన సెకండరీ గ్రేడ్ టీచర్లను రిలీవ్ చేయాలని, ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియామకాలు జరిగే వరకు విద్యా వాలంటీర్లను నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు గుండారపు చక్రపాణి, గుర్రాల రాజవేణులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల, పాఠశాలల రేషనలైజేషన్ ఉండదని చెప్పిన అధికారులు పాత నిబంధనలు, జీవో నెంబర్ 17 ముందుకు తెచ్చి అంతర్గతంగా రేషనలైజేషన్ ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా బాపురావు

జైపూర్, జూలై 1: మండల ఇన్‌చార్జి ఎంపీవోగా భీమారం ఎంపీవో శ్రీపతి బాపురావు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విద్యాసాగర్, కార్యదర్శులు ఎంపీవోను సన్మానించారు. ఎంపీవో మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.


రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి అధికారి

భీమిని, జూలై 1: రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తోందని జిల్లా వ్యవసాయాధికారి సురేఖ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద పీఏసీఎస్ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. రైతు భరోసాకు సంబంధించి అభిప్రాయ సేకరణ చేపట్టారు. కొందరు రైతులు 10 ఎకరాలలోపు ఇవ్వాలని, ఖాళీగా ఉన్న భూములకు ఇవ్వవద్దని సూచించారు. రైతుభరోసా డబ్బులు జూన్ మొదటి వారంలో అందేలా చూడాలని సలహాలు ఇచ్చారు. మండల పీఏసీఎస్ వైస్‌చైర్మన్ ఆకుతోట రాజయ్య, ఏవో విజయ్‌కుమార్, సీఈవో సంగర్సు రాజేశ్వర్‌రావు, ఏఈఓలు అఫ్రోజ్, వినోద్ కుమార్, కార్తీక్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న నేతకాని సంఘ నాయకులు

నస్పూర్, జూలై 1: నేతకాని కులస్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని నేతకాని మహర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తంచేశారు. కలెక్టర్ కుమార్‌దీపక్‌కు సంఘం నాయకులు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలన్నారు. పోడు వ్యవసాయం చేస్తున్న నేతకాని వారికి భూమి హక్కు పత్రాలు ఇవ్వాలన్నారు. హైదరాబాద్‌లో భవనానికి 5 ఎకరాలను కేటాయించి 10 కోట్ల నిధులతో భవనం నిర్మించాలన్నారు. కలాలి నర్సయ్య, గోళ్ళ రాజమల్లు, యువరాజ్, సంతోష్, గోమాస రాజం, తిరుపతి, మహేష్, భీమయ్య, రవి, పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

నస్పూర్, జూలై 1: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. నాయకులు మాట్లాడుతూ ఆసరా పెన్షన్లను ఆరు వేలను వెంటనే అమలు చేయాలన్నారు. బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, ప్రత్యేక హాస్టల్ ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, అప్పారావు, రాజయ్య, రాజేంద్రప్రసాద్, వెంకటేష్, లింగమూర్తి, రవి, సుజాత పాల్గొన్నారు.

స్పోర్ట్స్ అకాడమీ ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఏసీసీ, జూలై 1: తెలంగాణ క్రీడా అకాడమీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 3, 4 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీలో ప్రవేశాల కోసం ఓయూ క్యాంపస్‌లో పోటీలు జరుగుతాయని, హన్మకొండలోని రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్, ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీలో ప్రవేశాలకు హన్మకొండలో పోటీలు జరుగుతాయన్నారు. హాకీ అకాడమీలో ప్రవేశాలకు వనపర్తిలో, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలో వాలీబాల్ అకాడమీలో ప్రవేశాలకు సరూర్‌నగర్‌లో పోటీలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు బర్త్, స్పోర్ట్స్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో రిపోర్టు చేయాలన్నారు. 9848464642, 9490021220లో సంప్రదించాలన్నారు.

మొక్కలను సిద్ధంగా ఉంచాలి

మందమర్రిరూరల్, జూలై 1: హరితహారం కోసం నర్సరీల్లో మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. సోమవారం బొక్కలగుట్టలోని నర్సరీని పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం



వినతిపత్రం ఇస్తున్న దివాకర్ రావు, తదితరులు

శ్రీరాంపూర్, జూలై 1: సింగరేణి గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ అన్ని గనులు, విభాగాలపై టీబీజీకేఎస్ నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి, మేనేజర్లు, విభాగాల అధిపతులకు వినతిపత్రం అందించారు. ఎస్ఆర్‌పి 3 గనిపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిని ప్రైవేటీకరణ చేసేది లేదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ హామీ ఇచ్చారని, ఇప్పుడు సింగరేణికి చెందిన నాలుగు బొగ్గు బ్లాకులను వేలంలో పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. సంస్థ ప్రైవేటీకరణ అయితే దసరా, దీపావళి బోనస్, లాభాల వాటా నష్టపోతారన్నారు. యువతకు ఉద్యోగాలు లభించవని పేర్కొన్నారు. సింగరేణిని కాపాడుకునేందుకు అన్ని యూనియన్లు కలిసికట్టుగా పోరాడాలని పిలుపునిచ్చారు. సోమవారం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపి వినతిపత్రాలు అందజేశామన్నారు. 3న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం, 6న అన్ని ఏరియాల్లో జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా, వినతిపత్రాల అందజేత, 9న గోదావరిఖనిలో మహాధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు, అన్ని యూనియన్ల నాయకులు హాజరు కావాలని కోరారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్‌రెడ్డి, ఉప ప్రధాన కార్యదర్శి బండి రమేష్, సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, ఆర్గ నైజింగ్ కార్యదర్శి అన్వేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్య దర్శులు అక్కూరి సుబ్బయ్య, కార్యదర్శి పవన్‌కు మార్, కౌన్సిలర్ వంగ తిరుపతి, రత్నాకర్‌రెడ్డి, భాస్కర్, ఉత్తేజ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు



ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్, అక్రమ పట్టా చేయించుకున్నాడని తెలుపుతున్న బాయక్క

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1: ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవో హరికృష్ణతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. దండేపల్లి, జైపూర్, మంచిర్యాల, నస్పూర్, మెట్‌పల్లి, జన్నారం తదితర ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 67 దరఖాస్తులు వచ్చాయని, క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు.

- పింఛన్ ఇప్పిస్తానని మోసం

పింఛన్ ఇప్పిస్తానని చెప్పి కోటి రూపాయల విలువ గల 11 ఎకరాల భూమిని పట్టా చేయించుకున్నాడని బాధితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. కన్నెపల్లి మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన శీలం బాయక్కకు టేకులపల్లి శివారులో 11 ఎకరాల భూమి ఉంది. బాయక్క మరిది కొడుకు శీలం శ్రీనివాస్ పింఛన్ ఇప్పిస్తానని చెప్పి భూమిని పట్టా చేయించుకున్నాడు. వరుసకు పెద్దమ్మ అయిన బాయక్కను తహసీల్దార్ కార్యాలయానికి తీసుకువెళ్లి ఆమె పేరు మీద ఉన్న భూమిని పట్టా చేసుకున్నాడు. రైతుబంధు రావడం లేదని బాయక్క తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తెలుసుకోగా విషయం బయటపడింది. శ్రీనివాస్ స్వగ్రామం జన్నాపూర్ కాగా మంచిర్యాలలోని పంచాయతీ రాజ్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నాడని బాధితురాలు తెలిపింది. అక్రమ పట్టా చేయించుకున్న శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవడంతో పాటు తన భూమి తనకు ఇప్పించాలని బాధితురాలు కలెక్టర్‌ను కోరింది.

బెల్లంపల్లి: లంబాడిపల్లి పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని మేము సైతం ఎడ్యుకేషన్ రూరల్ డెవలప్‌మెంట్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రంగ ప్రశాంత్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. లంబాడితండా ఐదు సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీగా ఏర్పాటైందని, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు లేవని తెలిపారు. క్రీడా ప్రాంగణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలి

కాసిపేట: బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుల పట్టాదారు పాస్‌బుక్కుల నుంచి కాస్తు కాలాన్ని తొలగించిదని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాస్తు కాలాన్ని పునరుద్ధరించాలని ఆదివాసీ నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. ఆదివాసీ గిరిజన ప్రాంతాల్లో అధిక శాతం భూములు దొరల పేర్లమీదనే పట్టాలు ఉన్నాయని, గతంలో కాస్తు కాలంలో ఉన్న గిరిజన రైతుల భూములు లాక్కొన్నారన్నారు. 40 ఏండ్లుగా కాస్తు చేసిన గిరిజన రైతులకు ఆధారం లేకుండా పోయిందన్నారు.

చెన్నూరు: పట్టా భూముల్లో సాగు చేసుకుంటున్నా ఫారెస్టు అధికారులు దౌర్జన్యం చేస్తున్నారని రైతులు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతి పత్రం అందించారు. 45 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నామని తెలుపగా స్పందించిన కలెక్టర్ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. సుమారు 150 మంది రైతులు చెన్నూరులోని ఎఫ్‌డీవో కార్యాలయంలో ఎఫ్‌డీవో రమేష్‌ను కలిసి సమస్యను వివరించారు. అటవీ శాఖ అధికారులు పంటలు సాగు చేయవద్దని ట్రాక్టర్‌ను నిలిపివేస్తున్నారని, అక్రమకేసులు బనాయిస్తున్నారన్నారు. పంట రుణాలు, రైతుబంధు ప్రభుత్వం కల్పిస్తుందని అయినా అటవీ అధికారులు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎం ఒప్పంద సిబ్బంది ఎంపిక జాబితాపై అభ్యంతరాలు

మంచిర్యాల అర్బన్, జూలై 1: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఒప్పంద, పొరుగు సేవల పోస్టుల భర్తీకి సంబంధించి ఆ శాఖ అధికారులు ఇటీవల మెరిట్ జాబితాను విడుదల చేశారు. జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ పలువురు దరఖాస్తుదారులు సోమవారం అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అనర్హులకు పోస్టులను కేటాయించారని, ఏ పద్ధతిన భర్తీ పక్రియ జరిగిందో వివరణ ఇవ్వాలంటూ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి ఓ అభ్యర్థి ఫిర్యాదు చేశాడు. భర్తీ విషయమై వచ్చిన అభ్యంతరాలను ఉన్నతాధికారులకు నివేదించి రెండు, మూడు రోజుల్లో వివరాలు వెల్లడిస్తామని డీఎంహెచ్‌వో పేర్కొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత

మంచిర్యాల అర్బన్, జూలై 1: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని రామగుండం సీపీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల, జైపూర్, బెల్లంపల్లి, పెద్దపల్లి, గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో ఈనెల 31వ వరకు నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ప్రతీ డివిజన్ పరిధిలో ఒక ఎస్సై, వివిధ శాఖల నుంచి నలుగురు సిబ్బందిని నియమించి అందరి సమన్వయంతో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తామన్నారు. బాల కార్మికులు పనిచేస్తే 1098, 100కు ఫోన్ చేసి లేదా స్థానిక పోలీస్ అధికారులు మంచిర్యాల ఎస్సై 9848815120, జైపూర్ ఎస్సై 9441122702, బెల్లంపల్లి ఎస్సై 9490435081 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.

నీట్‌ను రద్దు చేయాలి

మందమర్రిటౌన్, జూలై 1: నీట్ పరీక్షను రద్దు చేయాలని ఢిల్లీలోని పార్లమెంట్ భవన్ ఎదుట సోమవారం పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఇతర ఎంపీలు నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడకు పంపిన ఒక ప్రకటనలో నీట్ పరీక్షపై సభలో చర్చకు డిమాండ్ చేస్తే అంగీకరించలేదని తెలిపారు. పరీక్షలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ చేయాలని, నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలన్నారు. కేంద్రం ఈ విషయంలో కక్షపూరితంగా వ్యవహరిస్తుందన్నారు. విద్యార్థుల పక్షాన కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పోరాడుతున్నారని తెలిపారు.

అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే

చెన్నూరు, జూలై 1: ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి పలు అభివృద్ధి పనులు మంజూరు చేశారని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర మంత్రితో మాట్లాడి జోడు వాగుల వద్ద బ్రిడ్జిని మంజూరు చేయించారన్నారు. ముంపు గ్రామ రైతులను హైదరాబాద్‌కు తీసుకువెళ్లి మంత్రితో మాట్లాడించి కరకట్ట నిర్మాణానికి విన్నవించారన్నారు. సూర్యనారాయణ, బాపగౌడ్, హేమంత్‌రెడ్డి, సుశీల్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, వెంకన్న, రాకేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నర్సింహారావు

ఏసీసీ, జూలై 1: జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక సేవకుడు, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జోనల్ కార్యదర్శి కొండు నర్సింహారావుకు చెన్నైలోని సౌతర్న్ వెస్ట్రన్ అమెరికన్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఆదివారం మద్రాస్‌లోని రమదాన్ హాలులో నిర్వహించిన యూనివర్శిటీ స్నాతకోత్సవంలో నర్సింహారావుకు డాక్టరేట్‌తో పాటు సోషల్ వర్కర్ అవా ర్డును అందించారు. నర్సింహారావు మాట్లాడుతూ సామా జిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గౌరవ డాక్టరేట్ అందించారన్నారు. నర్సింహారావును బేతి తిరు మల్‌రావు, చుంచు రాజ్‌కిరణ్, రాజేశం అభినందించారు.

ఘనంగా వైద్యుల దినోత్సవం



వైద్యులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాల అర్బన్, జూలై 1: జాతీయ డాక్టర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బాల మోహన్ ఆధ్వర్యంలో ప్రభుత్వాసుపత్రి వైద్యులు హరిశ్చంద్రారెడ్డి, వేదవ్యాస్, శ్రీమన్నారాయణ, నాగవేణి, వనిత, అలవేణి, సాయిలక్ష్మీలను సన్మానించారు. ప్రోగ్రాం చైర్మన్ వి.మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమౌళి, కోశాధికారి వెంకటేశ్వర్లు, మైక్రో క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ సిరిపురం శ్రీనివాస్, సీనియర్ లయన్ మెంబర్స్ వినయ్‌కుమార్, ఎస్.సూర్యనారాయణ, గోలి రాము, కొత్త సురేందర్, గుండా శ్రీనివాస్, చందూరి మహేందర్ పాల్గొన్నారు.

చెన్నూరు: డాక్టర్స్ డే పురస్కరించుకుని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న నలుగురు వైద్యులను ఆర్యవైశ్య అఫిషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (ఆవోపా) నాయకులు సన్మానించారు. మండల అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి సత్తయ్య మాట్లాడుతూ వైద్యవృత్తి ఎంతో పవిత్రమైందని పేర్కొన్నారు. వెంకటనర్సయ్య, శ్రీరాములు, పాండురంగం, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రాణపాయ స్థితిలో ఆస్పత్రులకు వచ్చే వారికి వైద్యులు అందించే సేవలు ఎనలేనివని లయన్స్ క్లబ్ మండల అధ్యక్షుడు మాదంశెట్టి మల్లికార్జున్ పేర్కొన్నారు. ద్వారక పీహెచ్‌సీ వైద్యురాలు సాగరికను సన్మానించారు. అన్నం సత్యనారాయణ, అలిశెట్టి లక్ష్మణ్, రాంచందర్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో దండేపల్లిలో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సతీష్‌కుమార్‌ను సన్మానించారు. రవికుమార్, సురేష్, గంగాధర్, పాల్గొన్నారు.

కాసిపేట: డాక్టర్స్‌డేను పురస్కరించుకుని ముత్యంపల్లి జిల్లా పరిషత్ పాఠశాలతో పాటు దేవాపూర్‌లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కాసిపేట ప్రభుత్వ వైద్యురాలు దివ్య, ఓరియంట్ డిస్పెన్సరీ డాక్టర్‌లను సన్మానించారు. లయన్స్‌క్లబ్ మంచిర్యాల సఖి కేంద్రం అధ్యక్షురాలు బండ శాంకరి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో గొప్పదని పేర్కొన్నారు. తపాల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోస్టుమన్ భూమయ్యను సన్మానించారు.

మందమర్రిరూరల్: వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో వైద్యురాలు స్వరూపరాణిని సన్మానించారు. సరిత, శ్రీదేవి పాల్గొన్నారు.

జన్నారం: జన్నారంలో ప్రభుత్వ వైద్యులను లయన్స్ సభ్యులు సన్మానించారు. భూమేష్, అంజిత్‌రావు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గైనకాలజిస్టు పూజితను, చార్టర్ అకౌంటెంట్ డే సందర్భంగా సీఏ శ్రీనాథ్‌ను, పోస్టల్ వర్కర్స్‌డే సందర్భంగా పోస్టుమాన్ బాబురావును సన్మానించారు.



చెన్నూరులో వైద్యులకు సన్మానం





హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలి

కాసిపేట, జూలై 1: గట్రావుపల్లిలో హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సోమవారం ఆదివాసీ గిరిజనులు సబ్‌సెంటర్ భవనం ఎదుట నిరసన చేపట్టారు. ఆదివాసీ సేన మండల ప్రధాన కార్యదర్శి సిడాం గణపతి మాట్లాడుతూ గట్రావుపల్లి ఆరోగ్య ఉప కేంద్రం 18 ఏండ్లుగా నిర్మాణ దశ లోనే ఉందన్నారు. సోనాపూర్ ఉమ్మడి పంచాయతీలోని ఆదివాసీ గిరిజనులు అనారోగ్యం బారిన పడితే మండల కేంద్రానికి లేదా జిల్లా కేంద్రానికి రావాలని, అక్కడకు వెళ్లే లోపే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు ఉన్నాయ న్నారు. ఐటీడీఏ, వైద్య ఆరోగ్య శాఖ అధికా రులకు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే భవనం పూర్తి చేసి ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలని, లేకుంటే ఆందోళ నలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెందూర్ ప్రభాకర్, అర్క ఇస్రు, కుడిమేత రఘు, పెందూర్ గుల్వంతరావు పాల్గొన్నారు.


హెల్త్ సబ్‌సెంటర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ట్రాన్స్‌ఫార్మర్‌పై విరిగి పడిన చెట్టు కొమ్మలు

15 రోజులైనా తొలగించని వైనం

కాసిపేట, జూలై 1: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు కొమ్మలు విరిగి పడి 15 రోజులు కావస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో విద్యుత్ సరఫరాలో నిత్యం అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల క్రితం వీచిన గాలి దుమారడంతోపాటు స్థానికులు చెట్టును నరికివేయగా చెట్టుకొమ్మలు ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాయి. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు కొమ్మలు పడి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్టు కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.


ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్టు కొమ్మలు

అదనపు గదులు నిర్మించాలి

కోటపల్లి, జూలై 1: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో అదనపు గదులు నిర్మించాలని ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వసతి గృహంలో మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివే విద్యార్థులు ఉంటున్నారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేవని, మరుగుదొడ్లు, స్నానపు గదులు సరిపడ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేసి అదనపు గదుల నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు.

ఆటో యూనియన్ పట్టణ అడహాక్ కమిటీ ఎన్నిక

ఏసీసీ, జూలై 1: మంచిర్యాల పట్టణ ఆటో యూనియన్ అడహాక్ కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జడ్పీ బాలుర మైదానంలో నిర్వహించిన సమావేశంలో పాత కమిటీ కాలపరిమితి ముగిసినందున నూతన కమిటీని ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షుడిగా కలవేని శేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ షఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కల్వల అంజయ్యలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పొట్ట మధుకర్, ఉపాధ్యక్షుడు చల్ల విక్రమ్, కార్యదర్శి ఆవుల సుధాకర్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. మహేష్, రఫీక్‌పాషా, సంయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్య పరిష్కారం


స్థానికులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ, ఎంపీడీవో

భీమారం, జూలై 1: మండల కేంద్రంలోని బంజారా కాలనీలో కల్వర్టు వద్ద పేరుకుపోయిన మురుగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా సోమవారం అధికారులు స్పందించి సమస్యను పరిష్కరిం చారు. మురుగునీరు రైతుల భూముల్లోకి రాకుండా ఇటుక గోడ పెట్టడంతో నీరు పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.అధికారులు పరిశీలించి గోడను కూల్చివేసి నీరు వెళ్లేలా చేశారు. దీంతో కాలనీ వాసులు ఆనందం వ్యక్తం చేశారు. ఎస్‌ఐ రాములు, ఎంపీడీవో రాథోడ్ రాధ, ఎంపీవో బాపురావు, మిషన్ భగీరథ డీఈ విద్యాసాగర్, కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు రాజ్‌కుమార్‌నాయక్, సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సతీష్‌రాజ్

చెన్నూరు, జూలై 1: తెలంగాణ ముదిరాజ్ మహాసభ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చెన్నూరు పట్టణానికి చెందిన నాయిని సతీష్‌రాజ్ నియమితులయ్యారు. కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్ సతీష్‌రాజ్‌ను నియమించి నియామకపత్రం అందించారు. ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తానని సతీష్‌రాజ్ పేర్కొన్నారు.

జిల్లాలో 9.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఆసిఫాబాద్, జూలై 1: కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో గడిచిన 24గంటల్లో 9.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది. చింతలమానేపల్లిలో 32.6మిల్లీమీటర్లు, బెజ్జూరులో 19.2, లింగాపూర్‌లో 18.2, కౌటాలలో 14.4, దహెగాంలో 12.0, పెంచికలపేటలో 11.2, తిర్యాణిలో 9.8, సిర్పూర్(యూ)లో 7.2, కాగజ్‌నగర్‌లో 6.2, జైనూరులో 5.0, రెబ్బెన, సిర్పూర్(టి)లలో 3.6మిల్లీమీటర్లు, వాంకిడిలో 2.2మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో 2మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

చెత్తను తొలగించాలి

బెజ్జూరు, జులై 1: మండల కేంద్రంలోని శ్మశాన వాటికకు వెళ్లే దారి చెత్తచెదారం నిండి ఉండడంతో దుర్గంధం వెద జల్లుతోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం పలువురు గ్రామస్థులు ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. మండల కేంద్రానికి చెందిన చికెన్, నాయిబ్రాహ్మణ, మెడికల్ షాపుల వ్యాపారులు వ్యర్థాలను విచ్చలవిడిగా పడవేస్తుండడంతో అటువెళ్లే రైతులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారని చెత్త వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



గ్రామ పంచాయతీ కార్యాలయానికి వచ్చిన గ్రామస్థులు

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జిగా తిరుపతి

బెజ్జూరు, జులై 1: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఇన్‌చార్జీగా బెజ్జూరు మండలం సలుగుపల్లికి చెందిన కుమ్మరి తిరుపతిని నియమిస్తూ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ ఓ లేఖలో ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి తిరుపతి ధన్యవాదాలు తెలిపారు.



సాగు భూమికే రైతుబంధు ఇవ్వాలి

సిర్పూర్(టి), జూలై 1: సాగుభూమికే రైతుబంధు ఇవ్వాలని రైతులు పేర్కొన్నారు. సోమవారం రైతు వేదికలో జిల్లా సహకారసంఘం ఆధ్వర్యంలో రైతు బంధుపై రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ సాగుచేసే రైతులకే ఈ పథకం వర్తింపజేయాల న్నారు. అలాగే 15ఎకరాలు లోపు ఉన్న వారికి మాత్రమే ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన ప్రకారం అందిరికీ ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ ఆడిట్ రబ్బానీ మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ఉన్నతాధికారులకు నివేదిస్తా మన్నారు. కార్యక్రమంలో ఏవో మధులత, పీఏసీఎస్ చైర్మన్ బాపు, ఏఆర్ అధికారి వెంకటరమణ, ఏఈవో కవిత, శ్రీనివాస్, సీఈవో రాకేష్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించాలి

వాంకిడి, జూలై 1: మండలకేంద్రంలోని ఎనోలికోలాంగూడ రోడ్డు పనులు సత్వరమే ప్రారంభించాలని సోమవారం డీటీ డీవోకు గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఎనోలి, కోలాంగూడ గ్రామానికి వెళ్లే రోడ్డుకు బీటీ రోడ్డు వేసేందుకు ఇరువైపులా మట్టివేసి సదరుకాంట్రాక్టర్ అర్థాంతరంగా నిలిపి వేశారన్నారు. దీంతో వర్షాలకు రోడ్డు మధ్యలో వరదనీరు నిలువ ఉండడంతో బురదగా మారి ఇబ్బందులు పడుతున్నా మన్నారు. వెంటనే రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో వీటీడీఏ అధ్యక్షుడు పగ్గు, జలపతిరావు, భీంరావు, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

బెజ్జూరు, జూలై 1: విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జీసీడీవో శకుంతల అన్నారు. సోమవారం బెజ్జూరు, సోమిని ప్రభుత్వ, గిరిజన ఆశ్రమపాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే అకాశం ఉన్నందున విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో ఏటీడీవో ఖమర్‌హుస్సేన్, ప్రధానో పాధ్యాయులు మారుబాయి, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.



రేపు మండల సర్వసభ్య సమావేశం

బెజ్జూరు, జూలై 1:మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈనెల 3న మండల సర్వసభ్యసమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు నివేదికలతో హాజరు కావాలని కోరారు.

నేడు వారసంతకు వేలం

పెంచికలపేట, జూలై 1: మండలంలోని ఎల్కపల్లి వారసంతకు మంగళవారం గ్రామపంచాయతీ కార్యా లయంలో వేలంపాట నిర్వహిస్తామని కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. ఆసక్తిగల వ్యాపారులు పాల్గొనాలన్నారు.

విద్యుదాఘాతంతో కూలీ మృతి

- కొత్త చట్టాల ప్రకారం కేసు నమోదు


సంతోష్ (ఫైల్)

నస్పూర్, జూలై 1: ఎఫ్‌సీఐ కాలనీలో సోమవారం ఉదయం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో నేర్పల్లి సంతోష్ (37) మృతి చెందాడు. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం మర్తాడి గ్రామానికి చెందిన సంతోష్ ఎఫ్‌సీఐ కాలనీ సిమెంట్ బ్రిక్స్ తయారీలో పనిచేస్తూ పక్కన ఉన్న షెడ్డులో ఉంటున్నాడు. ఉదయం లైట్ స్విచ్ ఆఫ్ చేసే ప్రయత్నంలో వైర్ తగిలి షాక్‌కు గురయ్యాడు. యజమాని వచ్చే సరికి కింద పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే మృతి చెందడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంతోష్ భార్య రెండేళ్ళ నుంచి తల్లిగారింట్లో ఉండగా ఇద్దరు కుమారులు మృతుడి తల్లిదండ్రుల వద్ద ఉంటున్నారు. మృతుడి అన్న సదయ్య ఫిర్యాదు మేరకు భారతీయ నాగరిక్ సురక్ష సంహిత చట్టం సెక్షన్ 194 ప్రకారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవికుమార్ తెలిపారు.

● కొత్త చట్టాలు అమలు - సీపీ శ్రీనివాస్

కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఎఫ్‌సీఐ కాలనీలో మెర్పల్లి అలియాస్ మారయ్య విద్యుత్‌షాక్ గురై చనిపోగా అతని సోదరుడు ఫిర్యాదు మేరకు నూతన చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని వివరించారు. కమిషనరేట్ పరిధిలో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి విడతల వారీగా కొత్త చట్టాలపై శిక్షణ ఇచ్చామన్నారు. మూడు కొత్త క్రిమినల్ చట్టాలలో సాంకేతికతలకు అనుగుణంగా కొత్త నిబంధనలు చేర్చారన్నారు. బాధిత వ్యక్తుల హక్కులను పరిరక్షించడం, నేరాల విచారణను సమర్థవంతంగా నిర్వహించడానికి కొత్త క్రిమినల్ చట్టాలను రూపొందించారన్నారు.

చైన్ స్నాచింగ్ పాల్పడిన దొంగల అరెస్ట్

నస్పూర్, జూలై 1: జగదాంబ కాలనీలో ఆదివారం సాయంత్రం భాగ్యలక్ష్మి అనే వృద్ధురాలి మెడలో పుస్తెలతాడును దొంగిలించిన ఆర్‌కే-8 కాలనీకి చెందిన రాజేందర్, దుర్గం స్వామిలను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఏసీపీ ప్రకాష్ వివరాలు వెల్లడించారు. భాగ్యలక్ష్మిని ఇద్దరు బైక్‌పై వెంబడించి 49.5 గ్రాముల పుస్తెల తాడును లాక్కొని బైక్‌పై పారిపోయారు. సీఐ ఆకుల అశోక్ ఆధ్వర్యంలో మూడు బృందాలు ఏర్పాటు చేసి సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టారు. గంట వ్యవధిలనే నిందితులను గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. రాజేందర్, దుర్గం స్వామిలను అరెస్టు చేసి వారు దొంగిలించిన పుస్తెల తాడుతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎస్సై రవి కుమార్, ఏఎస్ఐ ఇజాజ్, సతీష్, నరేందర్, సీసీఎస్ సిబ్బంది సత్తయ్య, సతీష్‌లను ఏసీపీ ప్రకాష్ అభినందించారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

భీమారం, జూలై 1: ఆవడం ఎక్స్‌రోడ్డు వద్ద వ్యాపారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నాలుగు సీసీ కెమెరాలను సోమవారం ఎస్ఐ రాములు ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు సీసీ కెమెరాతో నిందితులను గుర్తించవచ్చని తెలిపారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు.

బెల్లంపల్లి(తాండూర్): తాండూర్ మండలంలోని బోయపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద ట్రేడర్స్ యజమాని రమేష్ దుకాణం ఎదుట ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలను ఎస్ఐ కిరణ్‌కుమార్ ప్రారంభించారు. ఎస్ఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని తెలిపారు. నేరాలు, దొంగతనాలు, ప్రమాదాలు జరిగినప్పుడు సీసీ కెమెరా ద్వారా నిందితులను సులువుగా గుర్తించవచ్చని తెలిపారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్న యజమాని రమేష్‌ను అభినందించారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

బెల్లంపల్లి, జూలై 1 : పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో దాడికి పాల్పడిన శ్రీరాముల మహేష్ పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. బద్రి శివ ప్రసాద్, మహేష్‌లు బైక్‌లపై వెళ్తున్న క్రమంలో కాంటా చౌరస్తా వద్ద బైక్‌లు ఢీకొన్నాయి. ఈ క్రమంలో మాటా మాట పెరిగి మహేష్ అనే వ్యక్తి శివ ప్రసాద్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో మరికొంత మంది వ్యక్తులు ఉన్నారని కేసు నమదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

5న సింగరేణి బంద్‌ను విజయవంతం చేయండి

- సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బొగ్గు గనులను వేలంలో పెట్టడాన్ని నిరసిస్తూ ఈ నెల 5న నిర్వహించనున్న సింగరేణి బంద్‌ను విజయవంతం చేయాలని సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలోని సహజ వనరులను పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే ఆదివాసీలను హత్య చేస్తోందని, మణిపూర్ మారణకాండ సృష్టించిందని ఆరోపించారు. బొగ్గు తవ్వకాల్లో సుదీర్ఘ అనుభవం కలిగిన సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించే అవకాశం ఉన్నా ప్రభుత్వ రంగ సంస్థను బలహీనపరిచేందుకు కుట్ర పన్నిందన్నారు. తెలంగాణలో నిర్బంధ పరిస్థితులు కల్పించిన బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని, కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణితో వ్యవహరిస్తోందని హెచ్చరించారు. భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, సింగరేణి బొగ్గు బ్లాకులను ఆ సంస్థకే కేటాయించేలా పార్లమెంట్‌లో పోరాడాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం శ్రావణపల్లి, కెకె-6 ఏరియాలకు చెందిన రైతుల డిమాండ్లను ఆమోదించాలని, సత్తుపల్లి, కోయగూడెంలలో ఉపరితల గనులకు బదులుగా అండర్ గ్రౌండ్ గనులు తవ్వాలని, తద్వారా అక్కడ ఉన్న వ్యవసాయ భూములు కాపాడిన వారవుతారన్నారు. అండర్‌గ్రౌండ్ గనుల వల్ల నష్టపోయిన భూ నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం, పర్మనెంట్ ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ, సింగరేణి అధికారులు భూ నిర్వాసితులను మోసగిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు నిరసనలకు, బంద్‌కు విప్లవ ట్రేడ్ యూనియన్లను, క్రాఫ్ట్ సంఘాలను సంప్రదించకుండా ఏకపక్షంగా పోరాట షెడ్యూల్ ప్రకటించారన్నారు. ఇప్పటికైనా ఏఐటీయూసీ నాయకులు అన్ని సంఘాలు, విప్లవ క్రాఫ్ట్ యూనియన్లతో ఐక్య సంఘటన ద్వారా నిరసనలు, బంద్ చేపట్టాలని, కోల్‌బెల్ట్ ప్రజలను, కార్మికవర్గాన్ని, కాంట్రాక్ట్ కార్మికులను కలుపుకొని పోవాలని సూచించారు.

వందేభారత్ రైతులను మంచిర్యాలలో ఆపాలి


రైల్వే బోర్డు చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 1: నూతనంగా ప్రవేశపెట్టే హైదరాబాద్-నాగపూర్ వందే భారత్ సూపర్ ఫాస్ట్ రైలును మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ జరిగేలా చూడాలని సోమవారం న్యూ ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మసిన్హాకు పెద్దపల్లి మాజీ ఎంపీ వెంకటేష్ నేత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌లు వినతిపత్రం అందించారు. కేరళ, ఏపీ ఎక్స్‌ప్రెస్‌లు మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో ఆపాలని, మంచిర్యాల నుంచి తిరుపతికి కొత్త రైలును ప్రారంభించాలని విన్నవించారు. సమస్యలపై రైల్వే బోర్డు చైర్మన్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. సీనియర్ నాయకులు మోట పలుకుల తిరుపతి, మహిళ మోర్చా అధ్యక్షురాలు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం డబ్బులు ఇవ్వని నిర్వాహకుడు

● రూ.12 లక్షలు ఇవ్వకుండ మోసం

● సహకార సంఘ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

జన్నారం, జూలై 1: రైతుల ధాన్యం డబ్బులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సోమవారం చింతలపల్లి, బాదంపెల్లి గ్రామాలకు చెందిన రైతులు పొనకల్ సహకార సంఘం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. పురుగుల మందుల డబ్బాలు చేతిలో పట్టుకుని న్యాయం చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని పొనకల్ సహకార సంఘం పరిధిలో జనవరిలో చింతలపల్లె, బాదంపెల్లి గ్రామాలకు చెందిన 14 మంది రైతుల వద్ద నుంచి సుమారు 600 క్వింటాళ్ల ధాన్యాన్ని బాదంపెల్లి గ్రామానికి చెందిన గందోరి రవి కొనుగోలు చేశాడు. ధాన్యం డబ్బులను రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేయకుండా వ్యక్తుల ఖాతాలో జమ చేసి సుమారు రూ.12 లక్షలను కాజేశాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు రాకపోవడంతో రవిని నిలదీయడంతో అసలు విషయం బయటపడిందన్నారు. పాక్స్ సీఈవో రాజన్నను ధాన్యం డబ్బుల విషయం అడగగా నాకు సంబంధం లేదని రవిని అడగాలని తెలిపాడన్నారు. తమకు డబ్బులు ఇవ్వాలని, రవి వెనక ఎవరెవరు ఉన్నారో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా కార్యక్రమంపై కార్యాలయానికి వచ్చిన పీఏసీఎస్ డిప్యూటీ రిజిస్టర్ ఆడిట్ ఆఫీసర్ రాథోడ్ బిక్కు రైతులతో మాట్లాడారు. దీనిపై న్యాయ విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.


పొనకల్ సహకార సంఘం కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రవితో పాటు ఇందులో ప్రమేయం ఉన్న సీఈవో రాజన్నను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. పాక్స్ చైర్మన్ అల్లం రవి మాట్లాడుతూ సెంటర్ నిర్వహకుడు రవి కాజేసిన రైతుల ధాన్యం డబ్బులను మూడు రోజుల్లో అందేలా చూస్తామని తెలిపారు. రైతులు దాసరి తిరుపతి, సులువ జనార్దన్, మహేష్ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం నిలిపివేయాలి

జన్నారం, జూలై 1: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం పాటలను నిలిపివేయాలని సీపీఎం మండల కార్యదర్శి కనికరపు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం జన్నారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని బొగ్గు బ్లాకులను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికి అప్పగించాలన్నారు. లేకుంటే కార్మికులతో కలిసి ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, లింగన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి సంఘటనపై విచారణ జరుపుతాం

ఏసీసీ, జూలై 1: బెల్లంపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు పాత్రికేయులపై మావోయిస్టు పార్టీ కోల్‌బెల్ట్ కమిటీ కన్వీనర్ ప్రభాత్ చేసిన ఆరోపణలపై విచారణ జరుపుతామని టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించనున్నట్లు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శి కె.విరాహత్‌అలీ, కె.రాంనారాయణలు పేర్కొన్నారు. ఆరోపణలు రుజువైతే సంఘపరంగా చర్యలు చేపడతామన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలి

వేమనపల్లి, జూలై 1: వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. సోమవారం కేతనపల్లిలో పర్యటించారు. పారిశుధ్య పనులను, నర్సరీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్లను, మురికి కాలువలను శుభ్రంగా ఉంచాలని, చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వన మహోత్సవానికి నర్సరీలోని మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు. కార్యదర్శి జాఫర్ ఆలీ, సిబ్బంది ఉన్నారు.

గురుకుల అధ్యాపకుడికి డాక్టరేట్


అసోసియేట్ ప్రొఫెసర్ నుంచి డాక్టరేట్ పట్టా తీసుకుంటున్న నగేష్

జైపూర్, జూలై 1 : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న తోటి నగేష్‌కు డాక్టరేట్ వచ్చినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాల భాస్కర్ సోమవారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు గ్రామానికి చెందిన నగేష్ 2012లో ఉస్మానియా యూనివర్శిటీలో పీజీ పూర్తి చేసుకుని 2019లో గురుకులంలో అధ్యాపకునిగా ఉద్యోగం సాధించాడు. 2017లో పీహెచ్‌డీ అడ్మిషన్ పొంది యూనివర్శిటీకి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ ఉపేందర్ నేతృత్వంలో ఫోటోక్యాటలైడిక్, గ్యాస్‌సెన్సింగ్ పరిశోధనలు చేయగా జూన్ 28న ఉస్మానియా యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ పట్టాను పొందారు. సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ రీజినల్ కో ఆర్డినేటర్ స్వరూపరాణి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు.

ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ

మంచిర్యాల అర్బన్, జులై 1: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 69వ వార్సికోత్సవాన్ని పురస్కరించుకొని మాతా శిశు ఆసుపత్రిలో బాలింతలకు, వారి సహాయకులకు ఆదివారం బ్యాంకు అధికారులు పండ్లను పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ రితీష్ గుప్తా, చీఫ్ మేనేజర్ సాగర్ రావు, ఆసుపత్రి సూపరింటెండెంట్ హరిశ్చంద్రా రెడ్డి, రీజినల్ సెక్రటరీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సాగుకు సమాయత్తం

దండేపల్లి, జూలై 1: రైతులు వానాకాలం సాగుకు సమాయత్తమవుతున్నారు. తొలకరి జల్లులు కురువడంతో మండలంలోని రైతులు పొలాల్లో నాగలి, ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతున్నారు. మరో వైపు సేంద్రియ ఎరువులను తరలించడం, జీలుగలు చలడం, కొందరు రైతులు పత్తి చేనులో పత్తి గింజలను పెటడంలో నిమగ్నమవుతున్నారు. మండలంలోని ఎక్కడ చూసినా అన్నదాతలు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు.


లింగాపూర్‌లో దుక్కులు దునుతున్న రైతులు, కన్నెపల్లిలో పత్తి గింజలు పెడుతున్న మహిళ కూలీలు

కూరగాయల విత్తనాల పంపిణీ

నస్పూర్, జూలై 1: సీతారాంపల్లిలో సోమవారం రైతులకు దేశీయ కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. భావితరాల భవిష్యత్‌కు సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందని గ్రామ భారతి సహకారంతో హాజీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు సూచించారు. రామారావు, శ్రీనివాసరావు, శంకర్, రాములు, తిరుపతి పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మాజీఎమ్మెల్సీ


కలెక్టర్ వెంకటేష్ దోత్రేను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీష్

ఆసిఫాబాద్, జూలై 1: జిల్లాకలెక్టర్ వెంకటేష్ దోత్రేనే మాజీఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సంతోష్, నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, అబ్దుల్లా, ప్రతాప్, శ్యాంరావు పాల్గొన్నారు.

నిషేధిత పొగాకు ప్యాకెట్లు పట్టివేత



స్వాధీనం చేసుకున్న నిషేధిత పొగాకు ప్యాకెట్లు

కాగజ్‌నగర్ టౌన్, జూలై 1: కాగజ్‌నగర్ ఓవర్ బ్రిడ్జి సాయిబాబా ఆలయసమీపంలో ఓ పాత ఇంట్లో నిల్వ ఉంచిన నిషేధిత పొగాకు ప్యాకెట్ల బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ముందస్తుగా అందిన సమాచారం మేరకు ఓవర్ బ్రిడ్జి వద్ద దాడులు నిర్వహించగా ఓ ఇంట్లో పొగాకు ప్యాకెట్ల సంచులు లభించినట్టు తెలిపారు. ఈ మేరకు వాటిని నిల్వఉంచిన ఇంతియాజ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 1: గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని బాలికల ఆశ్రమపాఠశాలలో మూడురోజులపాటు ఉపాధ్యాయులకు నిర్వహించిన వృత్యంతర శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 10వ తరగతిలో ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. సమావేశంలో ఏటీడీఓ క్షేత్రయ్య, జిల్లాస్పోర్ట్స్ అధికారి మీనారెడ్డి, కోర్సు డైరెక్టర్ కృష్ణారావు, డీఆర్పీ వామన్‌రావు, ఆర్‌పీలు అరుణదేవి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు

వాంకిడి, జూలై 1: మండలంలో విద్యుత్‌సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యేకచర్యలు చేపడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మే నెలలో 33కేవీ, 11కేవీ విద్యుత్‌లైన్లకింద ఉన్న చెట్లు కొట్టివేశామన్నారు. అయినప్పటికీ కొన్నిచోట్ల గాలివానకు పోల్స్ విరగడం, ఇన్సులేటర్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు ఫెయిల్ అవడం లాంటివి జరిగాయన్నారు. రెండునెలల్లో 28మంది వ్యవవసాయ లబ్ధిదారులకు 9విద్యుత్ నియంత్రికరణ ట్రాన్స్ ఫార్మర్‌లను బిగించామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

బెండారలో డీవైఎఫ్ఐ నాయకుల సర్వే

వాంకిడి, జూలై 1: మండలంలోని బెండార గ్రామంలో సోమవారం డీవైఎఫ్ఐ నాయకులు యూత్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులతో అడిగితెలుసుకున్నారు. గ్రామంలో వీధి దీపాలు, మురికికాలువ సమస్య ఉందని అధికారులు వెంటనే సమస్య లను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మోతీరాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మోతీరాం

కెరమెరి, జూలై 1: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంపీపీ మోతీరాం అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పనితీరు మార్చుకో వాలన్నారు. అనంతరం వైస్‌ఎంపీపీ కలాం మాట్లాడుతూ మండలం కేంద్రంలో ప్లాస్టిక్ వేస్టేజ్ మేనేజ్‌మెంట్ యూనిట్ మహిళాసంఘాల ఆధ్వర్యంలో చేపట్టేందుకు అలాగే కమ్యూనిటీ కాంప్లెక్స్ నిర్మాణానికి సమావేశంలో తీర్మాణించి అను ుతులు, నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించనున్నట్లు తెలిపారు. అనంతరం పలుశాఖల అధికారులు తమతమ నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ తమ పదవీకాలం పూర్తయినప్పటికీ తాము ప్రజా సమస్యలపరిష్కారమే ధ్యేయంగా పని చేస్తామన్నారు.

అనంతరం ఈనెలతో ఎంపీటీసీ, జడ్పీటీసీల పదవీకాలం పూర్తికానుండడంతో అధికారులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ద్రుపతాబాయి, ఎంపీటీసీలు ఇష్తేకార్ అహ్మద్, భీంబాయి, యశోదబాయి, సంగీత, అధికారులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్‌సరఫరా చేయాలి

● మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు



అధికారులను నిలదీస్తున్న జడ్పీటీసీ శ్రీరామరావు

దహెగాం, జూలై 1: అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించాలని జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు అన్నారు. సోమవారం దహెగాం మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సులోచన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ శ్రీరామరావు మాట్లాడుతూ తేలికపాటి వర్షం, చిన్నపాటి గాలి దుమారం వచ్చినా మండలంలో విద్యుత్‌సరఫరాలో అంతరాయం కలుగుతోందని విద్యుత్‌శాఖ ఏఈని నిలదీశారు. అదేవిధంగా గిరివికాసం పథకంలో బోర్‌వేసి ఏళ్ల గడుస్తున్నా విద్యుత్‌కనెక్షన్లు ఇవ్వలేదని జడ్పీటీసీ ప్రశ్నించారు. ఏఈ మాట్లాడుతూ గాలిదుమారం, వర్షం కురిసినప్పుడు విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. గిరివికాస పథ కంలో బోర్‌లు వేసుకొన్న వారికి కనెక్షన్లు ఇవ్వడానికి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. దిగిడ, పీపీరావు కాలనీ, లోహ తదితర గ్రామాల ప్రజలు ఏడు కిలోమీటర్లకు పైగా నడిచి సరుకులు తెచ్చుకుంటున్నారని సమస్యను సభదృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావును సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సురేష్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం

● వర్షం వస్తే చెరువును తలపిస్తున్న రోడ్డు ● ప్రజలకు, వ్యాపారులకు తప్పని ఇబ్బందులు


రోడ్డుపై నిలిచిన వరద నీరు(ఫైల్)

వాంకిడి, జూలై 1: నాలుగు వరుసల రహదారి నిర్మాణంలో భాగంగా మండలకేంద్రంలో ఎన్‌హెచ్ఏఐ అధికారుల సైడ్‌డ్రైన్ సక్రమంగా నిర్మించకపోవడంతో ప్రజలు, వ్యాపారులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షంవస్తే చాలు ఈ రహదారి ద్వారా వచ్చే వరదనీరు బయటకు వెళ్లక పెద్దచెరువును తలపిస్తూ ప్రజలకు, వ్యాపారులకు తీవ్ర ఇబ్బందికరంగా తయారవుతోంది. వాంకిడి మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్ చౌరస్తా వద్ద అధికారులు అండర్‌పాస్ నిర్మించారు. హనుమాన్ మందిర్ కాలనీతోపాటు ఈ రహదారి పక్కన ఉన్న వ్యాపార సంస్థల ద్వారా వచ్చే మురుగు నీరు బయటికి వెళ్లడానికి అండర్‌పాస్ సమీపంలో జాతీయ రహదారి కింది నుంచి మురుగుకాలువను సక్రమంగా నిర్మించలేదు. దీంతో మురునీరు బయటికి వెళ్లక ప్రతిరోజు రోడ్లపై పారుతూ దుర్గంధంగా తయారవుతోంది. ఇదిలా ఉండగా చిన్నపాటి వర్షానికి వరదనీరు బయటికి వెళ్లక చౌరస్తానుంచి హనుమాన్ మందిర్ సమీపం వరకు వరదనీరు రోడ్డుపై మోకాలిలోతు వరకు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్రఅవస్థలకు గురవుతున్నారు. తేలికపాటి వర్షానికే రోడ్డుపై ఈమేరకు వరదనీరు నిలిచి ఉన్నాయంటే భారీవర్షం కురిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని వ్యాపారులు పేర్కొంటున్నారు. నెలరోజుల క్రితం భారీవర్షం రావడంతో వరదనీరంత కిరాణ, జనరల్‌స్టోర్, మెడికల్‌స్టోర్‌లలో చేరి నిత్యావసర సరకులు తడిసిపోయాయని వ్యాపారుస్తులు పేర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో భారీవర్షాల కారణంగా ఈ ప్రాంతంలో వరదనీరు నిలిచి నీరంతా వ్యాపార సముదాయాల్లో చేరే అవకాశాలు ఉన్నాయని ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

కల్వర్టును త్వరగా నిర్మించాలని నిరసన


కల్వర్టు వద్ద నిరసన తెలుపుతున్న కాలనీప్రజలు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 1: జిల్లాకేంద్రం లోని దస్నాపూర్‌కాలనీ నుంచి శ్మశానవాటికకు వెళ్లేదారిలో కల్వర్టును త్వరగా నిర్మించాలని సోమవారం కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరునెలల క్రితం శ్మశానవాటికకు వెళ్లేదారిలో కల్వర్టు నిర్మాణపనులు ప్రారంభించారని ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో నీరు నిలువుండడంతో ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలకు వెళ్లేందుకు దారిలేక తీవ్రఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. కల్వర్టు నిర్మాణం పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా దారిని ఏర్పాటు చేయాలని కోరారు. లేనిపక్షంలో కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతామన్నారు.

తాళం తీయరు.. ఆహ్లాదం పంచరు

● అలంకారప్రాయాలుగా పల్లె ప్రకృతివనాలు

● అధికారుల నిర్లక్ష్యమే కారణం



తాళం వేసి ఉన్న దరోగపల్లి పల్లె ప్రకృతి వనం

పెంచికలపేట, జూలై 1: గతరాష్ట్ర ప్రభుత్వం ఆహ్లాదం కోసం ప్రతి గ్రామానికో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. పల్లె ప్రజలకు ఆహ్లాదభరితమైన వాతావరణం అందించేందుకు ఏర్పాటు చేసిన ఈ పల్లె ప్రకృతి వనాలు ఆహ్లాదం మాట అటు ఉంచితే కనీసం అందులో కాసేపు సేదతీరడానికి కూడా ఉపయోగ పడడం లేదు. మండలవ్యాప్తంగా 12గ్రామ పంచాయ తీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు అధికారుల నిర్వాహణ లోపంతో అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. మండల వ్యాప్తంగా పల్లె ప్రకృతివనాలకు తాళాలు వేసి ఉంచుతున్నారు. బయటనుంచి చూడడమే గాని అందులో కాసేపు సేద తీరలేక పోతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచు కొని సక్రమంగా మొక్కలకు నీరు అందించక సరైనా సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మొక్కలు ఎదగడం లేదు. ఇప్పటికైనా అధికారులు పల్లెప్రకృతి వనాలను పల్లెప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై ఎంపీడీవో ఆల్బర్ట్‌ను సంప్రదించగా పశువులు దూరకుండా తాళాలు వేస్తున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో పల్లెప్రకృతివనాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

తల్లీ, ముగ్గురు కూతుళ్ల ఆత్మహత్యాయత్నం

● ఇద్దరు కూతుళ్ల పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కూతుళ్లు



చికిత్స పొందుతున్న తల్లి అనిత

కాగజ్‌నగర్, జూలై 1: తాగుడుకు బానిసైన భర్త.. నిత్యం వేధింస్తుండటంతో భరించలేక ముగ్గురు కూతుళ్లతో సహా ఓతల్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కుమరంభీం ఆసిఫా బాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడలో చిలు కూరి ప్రతాప్, భార్య అనిత, పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. ప్రతాప్ ప్రతిరోజు తాగి భార్యతో గొడవపడుతుండే వాడు. సోమవారం ఉదయం కూడా గొడవజరగటంతో జీవితంపై విరక్తి చెందిన అనిత(55), సాయంత్రం కూతుళ్లు లక్ష్మి(21), రమ్య(16), ఐశ్వర్య (14)ను తీసుకొని పొలానికి కెళ్లింది. అక్కడపొలంలో ఉన్న పురుగుల మందును ముగ్గురు తాగారు. ఇంతలో అపస్మారకస్థితిలో పడిఉన్న వారి అక్కడ పనిచేస్తున్న కూలీలు గమనించి హుటాహుటిన కాగజ్‌నగర్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. నలుగురికి వైద్యచికిత్సలు అందించారు. కాగా, లక్ష్మి, రమ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు డాక్టర్లు పేర్కొన్నారు. ఈ విషయమై సీఐ అల్లం రాంబాబును వివరణ కోరగా గజ్జిగూడకు చెందిన ప్రతాప్ భార్యతో తరుచూ గొడవపడుతుండే వాడని, తీవ్రమనోవ్యధకు గురైన భార్య అనిత, కూతుళ్లతో సహా ఆత్మహత్య యత్నానికి ఒడిగట్టినట్టు వివరించారు. ప్రసాద్‌పై గతంలో కూడా కేసులున్నట్టు వివరించారు. ఇటీవలపై బెయిల్‌పై వచ్చినట్టు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి ప్రతాప్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు.

జిల్లాలో పేదప్రజల సొంతింటి కల కలగానే మిగిలిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలోని రెండు నియోజవర్గాలకు కలిపి 1400 ఇళ్లు మంజూరయ్యాయి. కానీ ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపోక గుత్తేదారు మధ్యలోనే పనులను నిలిపి వేశాడు. దీంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచి పోయాయి. లబ్ధిదారుల ఆశలు నిరాశల య్యాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైన స్పందించి పూర్తి చేయకపోతుందా అని ఎదురుచూస్తున్నారు.



నిలిచిపోయిన రెండు పడకల గదుల ఇళ్లు

పేదల కల నెరవేరేనా?

● మధ్యలోనే నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు ● కొత్త ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

వాంకిడి, జూలై 1: నిరుపేదలకు.. సొంతింటి కల నేరవేరేటట్లు కనిపించడంలేదు. ఇళ్లు లేని వారికి రెండు పడక గదుల ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావించి గత ప్రభుత్వం నిర్మాణాలు చేపట్టింది. నిర్మాణ సామగ్రి ధరలు పెరిగిపోవడం, ప్రభుత్వం కేటాయించిన నిధులు నిర్మాణ పనులకు చాలకపోవడంతో గుత్తేదారులు చేతులేత్తేశారు. దీంతో నిర్మాణాలు నిలిచిపోవడంతో నిరుపేదలు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత ఏడాది జనవరి 2023వరకు రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లు పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల పంపిణీకి చర్యలు తీసుకోవాలని అవసరమైతే లాటరీ పద్ధతిలో ఎంపిక చేయాలని గత ప్రభుత్వం భావించినా ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులకు సొంతిళ్లు కలగానే మిగిలిపోయింది.

జిల్లాకు 1400ఇళ్లు మంజూరు..

జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూర్(టి) నియోజక వర్గాలకు 700 చొప్పున కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 1400డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించారు. తొలివిడతలో సిర్పూర్(టి) నియోజక వర్గంలో ఆర్అండ్‌బీశాఖ ద్వారా కాగజ్‌నగర్ మండలంలో 480 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ఇందులో 288ఇళ్ల పనులు చివరిదశలో ఉండగా మరో 192 వివిధ దశల్లో నిలిచిపోయాయి. అలాగే ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్, వాంకిడి మండలాలతోపాటు పలుప్రాంతాల్లో పనులు ప్రారంభించినా ఎక్కడా కూడా పూర్తి కాలేదు. బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. జిల్లాలో ఒక్క ఇల్లు కూడా పూర్తికాకపోవడంతో లబ్ధిదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మధ్యలో నిలిచిపోయిన ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలుతీసుకోవాలని పేద ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల పంపిణీకి గత ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు

డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీకి గత ప్రభుత్వం పలు మార్గదర్శకాలు విడుదల చేసింది. లబ్ధిదారు సొంతిల్లు లేని వారై ఉండాలి. అద్దె ఇళ్లలో గానీ, గుడిసెల్లో నివసిస్తూ ఉండాలి. తక్కువ ఆదాయం కలిగిన వారు, రాష్ట్రానికి చెందిన వారై ఉండాలి. ఒక కుటుంబంలో కేవలం ఒక దరఖాస్తు మాత్రమే సమర్పించేందుకు అవకాశం ఉంటుంది. ఏదైనా పథకంలో ఇప్పటికే ఇల్లు పొంది ఉన్న వారు అనర్హులు. అలాగే గృహిణి పేరుతో ఇల్లు మంజూరు చేస్తారు. 560 చదరపు అడుగుల స్థలంలో ఇల్లు నిర్మించాలి.

సకాలంలో పూర్తి అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

అశోక్ మహోల్‌కార్- బీఎస్‌పి జిల్లా అధ్యక్షుడు



జిల్లాలోని అనేకమంది నిరుపేదలు డబూల్ బెడ్‌రూం ఇళ్లకోసం ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలు నేటివరకు పూర్తికాలేదు. కాంట్రాక్టర్లు బిల్లులు రాలేదన్న సాకుతో మధ్యలోనే పనులు నిలిపివేశారు. దీంతో అర్హులైన లబ్ధిదారుల సొంతింటి కల నేరవేరడంలేదు. డబూల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తి అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకొని అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

వైద్యవృత్తిని నిబద్ధతతో చేయాలి: డీఎంహెచ్‌వో



సిబ్బందితో జిల్లా వైద్యాధికారి తుకారాం భట్

ఆసిఫాబాద్, జూలై 1: వైద్యవృత్తిని ఎంతో నిబద్ధతతో చేయాల్సి ఉంటుందని జిల్లా వైద్యాధికారి తుకారాం భట్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయం లో సిబ్బందితో కలిసి డాక్టర్స్ డే వేడుకలను జరుపుకున్నారు. ఈసందర్భంగా సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైద్యులు తమవృత్తిలో ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని నేర్చుకోవడంతోపాటు సేవేలక్ష్యంగా ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో వైద్యశాఖలో పనిచేస్తున్న ప్రతిఒక్కరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీడెమో నాగలక్ష్మి, డీపీహెచ్ఎస్ నర్సమ్మ, సిబ్బంది చంద్రశేఖర్, రమేష్‌చంద్ర, గోపి, తుకారాం, స్రవంతి, మణికాంత్, ఫాతిమా, సురేష్, శ్రీకాంత్, ప్రవీణ్, శివ, షకీల్, అశోక్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా

● ప్రొటోకాల్ పాటించాలని డిమాండ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్, జూలై 1: జిల్లాలో నిర్వహించే వివిధరకాల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకు లను అనుమతించవద్దని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం మంత్రి సీతక్క పర్యటనలో జిల్లాలోని రెబ్బెన మండలకేంద్రంలో ప్రొటోకాల్ పాటించకపోవడంపై జిల్లాకేంద్రంలో పార్టీశ్రేణులతో కలిసి కలెక్టరేట్‌ఎదుట ఆమె ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో లోకేశ్వ ర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు వారి పార్టీ కార్యక్రమాల వలే అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నా రని ఆరోపించారు. జిల్లా అభివృద్ధి చేయడం ఆహ్వానంచదగ్గదే అయినప్పటికీ ఒక ఆదివాసీ ఎమ్మెల్యేగా తమకు గుర్తింపు ఇవ్వక పోవడం ఏమిటని ఆవేదన వ్యక్తంచేశారు. సాటి ఆదివాసి మంత్రికి కూడా ఇంత చిన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. తమపార్టీ కార్యకర్తలను ఆదివారం రెబ్బెన పర్యటనలో కాంగ్రెస్‌నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని అన్నారు. తమను రాజకీయంగా ఎదుర్కొలేక ఇటువంటికుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతమైతే ఊర్కొనేది లేదన్నారు. తానుపార్టీ మారుతున్నట్లు కాంగ్రెస్ నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారన్నారు. రాజకీయాల్లో ఉన్నన్ని రోజులు కేసీఆర్‌తోనే ఉంటానని పునరుద్ఘాటించారు. ప్రతిపక్షంలో ఉంటూ ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు అజయ్‌కుమార్, ద్రుపతాబాయి, అరుణ, ఎంపీపీలు సౌందర్య, భాగ్యలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ అలీబిన్‌అహ్మద్, సరస్వతీ, రవీందర్, లాలా, భీమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే హరీష్‌బాబుకు సన్మానం



ఎమ్మెల్యే హరీష్‌బాబును సన్మానిస్తున్న డాక్టర్లు

కాగజ్‌నగర్, జూలై 1: హైదరాబాద్‌లోని లక్డీకాపుల్ వద్ద ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగిన డాక్టర్స్ డే వేడుకల్లో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబును సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏసిబ్బందిపాల్గొన్నారు.

మహిళలు సమస్యలపై నిర్భయంగా సంప్రదించాలి

ఆసిఫాబాద్, జూలై 1: జిల్లాలోని మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదిం చవచ్చని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మహిళల రక్షణ కోసం షీ టీం, యాంటి ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు. జూన్‌నెలలో షీటీంద్వారా 60 హాట్‌స్పాట్ ప్రదేశాలను గుర్తించామని, 16అవేర్నెస్ ప్రోగ్రాంలు నిర్వహించామన్నారు. ఒక కేసులో కౌన్సెలింగ్ చేశామన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా 8712670564, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

ప్రొటోకాల్‌ను విస్మరించవద్దు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 1: ప్రజాప్రతినిధులను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించాలని ప్రొటోకాల్‌ను అధికారులు విస్మరించవద్దని జడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధీనంలో చేపట్టే ప్రారంభోత్సవం, శంకుస్థాపనలకు స్థానిక ప్రజాప్రతినిదులతోపాటు ఎమ్మెల్యేనుగౌరవప్రదంగా ఆహ్వానించాలని అన్నారు. ప్రభుత్వపరంగా చేపట్టే కార్యక్రమాలకు పార్టీజెండాలను, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం సబబుకాదని హితవులు పలికారు. ప్రొటోకాల్‌పై కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఆదివారం రెబ్బెనలో జరిగిన సంఘటన పునరావృతంకాకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార కార్యక్రమాలకు పార్టీ తోరణాలు కానీ, జెండాలుకానీ ఏర్పాటుచేస్తే శాఖాపరమైన చర్యలుతీసు కోవాలని కోరారు. అధికారపార్టీ నాయకులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదన్నారు.

మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్

జైనూర్, జూలై 1: మండల కేంద్రంలో మీ సేవాకేంద్రాన్ని ఇన్‌చార్జీ తహసీల్దార్ బీర్షావ్ సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మీసేవా కేంద్రంలో ఆన్‌లైన్ సేవల్ని పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ నిబంధనలకు అనుసారంగా సేవలందిం చాలని కోరారు. ఆదివాసీ నాయకులు దుర్రె సుభాష్, జనార్దన్, ఇస్రు, పెందూర్ ప్రకాష్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి కృషి: కలెక్టర్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 1: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్, సురేష్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణంలోని హడ్కో కాలనీకి చెందిన రామయ్య తనపేరిట జన్కాపూర్ శివారులో ఉన్న పట్టాభూమిలో అనుభవదారుడి కాలంలో వేరేవ్యక్తి పేరు వస్తోందని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని దరఖాస్తు చేశారు. చింతలమానేపల్లి మండలం బాబాసాగర్ గ్రామానికి చెందిన ఎల్ములె నాందేవ్ తన కుమారుడికి వికలాంగ పెన్షన్ మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ మండలం కొమ్ము గూడ గ్రామానికి చెందిన వాణి తనకు ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు సమర్పించారు. వాంకిడి మండలం సల్పలగూడ గ్రామానికి చెందిన జుగాదిరావు కనగర్గాం గ్రామశివారులో తన తండ్రి పేరిటఉన్న భూమికి పట్టా మంజూరు చేయాలని, ఆసిఫాబాద్ మండలం బూర్గుడకు చెందిన రైతులు తమగ్రామం గుండా నాలుగువరుసల రహదారి నిర్మాణంలో అమర్చిన రైలింగ్ వల్ల వ్యవసాయ పనులకు వెళ్లడానికి ఇబ్బందులు ఉన్నందున దారి కల్పించాలని దరఖాస్తు అందజేశారు. సిర్పూర్(టి) మండలం పారిగాం గ్రామానికి చెందిన రైతులు తమ గ్రామానికి చెందిన గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్రసహాయకుడు అవకతవకలకు పాల్పడుతున్నందున విచారణ జరిపిచర్యలు తీసుకోవాలని, కౌటాల మండలం బోధంపల్లికి చెందిన పోశయ్య కన్నెపల్లి శివారులో అటవీ భూమిలో స్వచ్ఛందంగా మొక్కలు నాటి పెద్దవిగా చేసి నందుకు ఆర్థికసాయం అందించాలని, ఆసిఫాబాద్‌పట్టణంలోని జక్కాపూర్‌కు చెందిన రజిత తనకు పొరుగు సేవల ద్వారా ఉపాధి కల్పించాలని, దహెగాం మండలం కమ్మర్‌పల్లికి చెందిన భాగ్యలక్ష్మి పట్టాభూములకు హద్దురాళ్లు ఏర్పాటుకు చాలన్ కట్టినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని దరఖాస్తు చేసుకున్నారు. జైనూరు మండలం దుబ్బ గూడ గ్రామానికి చెందిన జంగు తన పాలివాళ్ల నుంచి రావాల్సిన పట్టా భూమిని ఇప్పించాలని, ఆసిఫాబాద్ మండలం చిర్రకుంటకు చెందిన ప్రవీణ్‌కుమార్ మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం కల్పించాలని దరఖాస్తు అందజేశారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక టీంలు: ఏఎస్పీ



టీం సభ్యులతో ఏఎస్పీ ప్రభాకర్

ఆసిఫాబాద్, జూలై 1: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు జిల్లాలోని ఇతరశాఖల సమన్వయంతో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేస్తామని ఏఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. సోమవారం పోలీసుస్టేషన్‌లో ఆపరేషన్ ముస్కాన్-10లో భాగంగా అన్నిశాఖల అధికారులతో సమన్వయ సమావేశం న్విహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలించడానికి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ సబ్‌డివిజన్‌లలో పోలీసు, చైల్డ్‌ప్రొటక్షన్ అధికారులతో కలిసి రెండు టీంలను ఏర్పాటు చేశామన్నారు. ఈ టీంలు జూలై నెల మొత్తం తనిఖీలు నిర్వహించి బాలకార్మికులను గుర్తించి వారినిపనిలో నుంచి విముక్తి కల్పించి పాఠశాలల్లో చేర్పిస్తార న్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లాసంక్షేమాధికారి భాస్కర్, సీడబ్ల్యూసీ మెంబర్ సమీరుల్లాఖాన్, దశరథ్, డీఈవో ఉదయ బాబు, డీసీపీవో మహేష్, డీసీఆర్బీ రమేష్ పాల్గొన్నారు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం

● నిందితుడి అరెస్టు.. రిమాండ్

సిర్పూర్(టి), జూలై 1: సభ్య సమాజం సిగ్గు పడేలా ఓ కామాంధుడు మూడేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన ఘటన సోమవారం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) మండలం వెంకట్రావుపేట గ్రామంలో చోటుచేసుకుంది. సిర్పూర్(టి) మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో ఆదివారం తోటిపిల్లలతో ఆడుకుంటున్న బాలిక(3)ను అదే గ్రామానికి చెందిన బూదే రాజేందర్ తన ఇంటిలోకి ఎత్తుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని తోటి పిల్లలు బాలిక తల్లితండ్రులకు తెలియజేశారు. దీంతో వారు రాజేందర్ ఇంట్లోకి వెళ్లిచూడగా అప్పటికేచిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. దీంతో బాలికతండ్రి స్థానిక సిర్పూర్(టి) పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ నేతృత్వంలో పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ వెల్లడించారు.

డాక్టర్స్ డే సందర్భంగా సన్మానం



డాక్టర్‌ను సన్మానిస్తున్న పాఠశాల నిర్వాహకులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 1: సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో డాక్టర్స్‌డే సందర్భంగా సోమవారం డాక్టర్ విష్ణువర్ధన్ రావును సన్మానించారు. అనంతరం అంతర్జా తీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వ్యాసరచనపోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్, గోవిందరావు, సత్యనారాయణ, సంతోష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు

దహెగాం, జూలై 1: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన చాపెల వెంకటేష్‌ను కులం పేరుతో దూషించిన అదే గ్రామానికి చెందిన ముగ్గురిపై సోమవారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పొన్నం సాయి, పొన్నం రాకేష్, పొన్నం శ్రీనివాస్‌కు, చాపెల వెంకటేష్‌కు గతంలో పోడు భూమి విషయమై గొడవ జరిగింది. ఈ క్రమంలో హత్తిని గ్రామంలో జూన్ 25న వెంకటేష్ తారస పడగా ముగ్గురు అతనితో గొడవకు దిగారు. వెంకటేష్‌ను కులం పేరుతో దూషించారు. బాధితుడు వెంకటేష్ ఫిర్యాదు మేరకు ముగ్గురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పర్మినెంట్ కార్మికులతో సమానంగా సౌకర్యాలు: జీఎం



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్, జూలై 1: సింగరేణిలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ కార్మికుల మాదిరిగా సౌకర్యాలు కల్పించనున్నట్లు జీఎం బి సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పర్మినెంట్ కార్మికులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు ఆన్‌లైన్ నమోదు జరుగుతోందని, ఆ సమాచారం వైద్యం, ఇతరవసతులు కల్పించేందుకు ఉపయోగపడుతుందన్నారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు సైతం వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే వివిధ బ్యాంకులతో ఒప్పందం చేసుకొని 30లక్షల రూపాయల వరకు ప్రమాద బీమా ఇప్పించే ప్రయత్నం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) పి అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, క్వాలిటీ మేనేజర్ కె వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ పీవో కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు అభినందనీయం

సింగరేణి వైద్యుల సేవలు అభినందనీయమని ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నస్పూర్ డిస్పెన్సరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గనుల్లో ప్రమాదాలు, కరోనా వంటి అత్యవసర సమయాల్లో సింగరేణి వైద్యులు చేస్తున్న సేవలు అభినందించదగినవన్నారు. ఉత్తమవైద్యుడు డాక్టర్‌వేదవ్యాస్‌తోపాటు వైద్యసిబ్బందిని ఆయన సన్మానించారు. కార్యక్రమంలో అధికారుల సంఘంఏరియా అధ్యక్షుడు కె వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, ఏజెంట్ ఏవీ రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవిందరావు, వైద్యులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం పాటలను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిటౌన్, జూలై 1: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బొగ్గు బావుల వేలంపాటలను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 5న తెలంగాణలోని సింగరేణి ఆరు జిల్లాలల్లో కలెక్టరేట్‌ఎదుట ధర్నాలు చేపడుతున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. సోమవారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెట్టుబడిదారులకు ప్రయోజనం చేకూర్చే వేలంపాటలను వెంటనే రద్దు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమంకోసం బొగ్గుబ్లాకులు సింగరేణికే కేటాయించేలా చూడాలన్నారు. సమావేశంలో బ్రాంచికార్యదర్శి సలేంద్రసత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాథుని సుదర్శన్, నాయకులు అక్బరలీ, కంది శ్రీనివాస్, దాగం మల్లేష్ పాల్గొన్నారు.

కాసిపేట: బొగ్గుబ్లాకులను సింగరేణికే అప్పగించాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. సోమవారం కాసిపేట 1వ గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం బొగ్గుబ్లాకులను నిర్వీర్యంచేసి సింగరేణిలో ఉద్యోగభద్రత లేకుండా చేయాలని చూస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి అక్బర్‌అలీ, ఇప్పకాయల లింగయ్య, మందమర్రి, బెల్లంపల్లిబ్రాంచ్ కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: బొగ్గుబ్లాకుల వేలంను ఉపసంహరించుకోవాలని సోమవారం మందమర్రి ఏరియాలోని అన్నిగనులు, డిపార్టుమెంట్లవద్ద టీబీజీకేఎస్ నాయకులు అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో కేంద్రకమిటీ డిప్యూటి జనరల్‌సెక్రెటరీ, ఓ రాజశేఖర్, ఏరియాఉపాధ్యక్షుడు జె రవీందర్, వీరారెడ్డి, మల్లేష్‌సాయి పాల్గొన్నారు.

జైపూర్: బొగ్గు బ్లాకులను ఎలాంటి షరతులు లేకుండా సింగరేణికే కేటాయించాలని సోమవారం టీబీజీకేఎస్ నాయకులు ఐకే1ఏగని, ఓసీపీ ఏఎస్‌వో సతీష్‌కు వినతిపత్రం అందించారు. బొగ్గు బ్లాకులను వేలంవేయడాన్ని నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనతెలిపారు. టీబీజీకేఎస్ గనిఇన్‌చార్జీ రత్నాకర్ రెడ్డి, నాయకులు గోపాల్, తిరుపతి, దేవేందర్ రెడ్డి, నరేందర్, నరేష్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: బొగ్గుగనులపై కేంద్ర ప్రభుత్వ వైఖరినిని నిరసిస్తూ సోమవారం శాంతిఖని గనిపై టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈసందర్భంగా టీబీజీకేఎస్ జాయింట్‌సెక్రెటరీ సిద్దంశెట్టిసాజన్, ఆర్గనైజింగ్ సెక్రటరీరమణ మాట్లాడుతూ బొగ్గుగనులను సింగరేణికి కేటాయించాలన్నారు. బొగ్గు బ్లాకులవేలం నిలిపివేయకపోతే ఉద్యమాలు తీవ్రతరంచేస్తామని హెచ్చరించారు. అనంతరం గని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, మల్లేష్, హన్మంతరావు, అశోక్, విజయ్, వెంకటేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

అదనపు ఉత్పత్తితోనే ప్రగతి: జీఎం

మందమర్రిటౌన్, జూలై 1: ఏరియాకు నిర్ధేశించిన లక్ష్యంతోపాటు అదనపు ఉత్పత్తి సాధిస్తేనే ఏరియా అభివృద్ధి సాధ్యమవుతుందని ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. సోమవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరం ఏరియాకు 34.6లక్షల టన్నులు నిర్ధేశించగా ఇప్పటివరకు 8.47లక్షల టన్నులు సాధించామని తెలిపారు. మే నెలకు 2.94లక్షల టన్నులకు గాను, 2.75లక్షల టన్నులు సాధించామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజిరెడ్డి, పీఎం శ్యాంసుందర్ ,ఐఈడీడీజీఎం రాజన్న, తదితరులు పాల్గొన్నారు.